ప్రభుత్వ భూమిపై ఇంటెలిజెన్స్ ఆరా

హనుమకొండ, ఫిబ్రవరి 10 : హనుమకొండ హంటర్‌రోడ్డులోని సైన్స్ సెంటర్‌కు చెందిన సర్వే నంబర్ 964లోని ప్రభుత్వ భూమిపై ఇంటెలిజెన్స్ అధికారులు ఆరా తీస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ భూమి ఆక్రమణ విషయంలో సోమవారం హనుమకొండ తహసీల్దార్ కార్యాలయానికి ఇంటెలిజెన్స్ అధికారులు వచ్చి భూమి మొత్తం ఎంత? సైన్స్ సెంటర్‌కు ఎంత కేటాయించారు? ఎంత భూమి కబ్జాకు గురైంది? తదితర వివరాలను సేకరించినట్లు తెలిసింది. గతంలో సైన్స్ సెంటర్‌కు సంబంధించిన భూమి ఆక్రమణకు గురవుతుందని ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో సర్వే చేసి హద్దులు నిర్ణయించి హెచ్చరిక బోర్డులు, ఫెన్సింగ్ ఏర్పాటు చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఇదే విషయంపై తహసీల్దార్ శ్రీపాల్‌రెడ్డిని ఫోన్‌లో సంప్రదించగా, ఇంటెలిజెన్స్ అధికారులు వచ్చిన మాట వాస్తవమేనని, ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితాతో పాటు సైన్స్ సెంటర్‌కు చెందిన భూమి వివరాలు అడిగారని తెలిపారు. అలాగే రిజిస్ట్రేషన్ ఆఫీసు సమీపంలోని ప్రభుత్వ భూముల వివరాలు అడిగారని చెప్పారు.

రైతులకు వెంటనే బోనస్ చెల్లించాలి

పరకాల, ఫిబ్రవరి 10 : రైతుల నుంచి కొనుగోలు చేసిన సన్న వడ్లకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బోనస్ చెల్లించాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు చింతిరెడ్డి మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నదని విమర్శించారు. రైతుల నుంచి సన్న ధాన్యాన్ని కొని సుమారు రెండు నెలలు పూర్తయినా ఇప్పటి వరకు బోనస్ చెల్లించలేదని, ఎప్పుడు చెల్లిస్తారని ప్రశ్నించారు. వర్షాకాలం పంటకు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా డబ్బులను ఎగ్గొట్టడంతో రైతులు అప్పులు తెచ్చి పంటలు సాగు చేశారని, తీరా దిగుబడి వచ్చిన తర్వాత బోనస్ వస్తదేమోనని తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వానికి విక్రయిస్తే చివరికి మొండి చేయి చూపుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక పక్క రైతులు తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరుగుతున్నాయని, మరో పక్క ప్రభుత్వం బోనస్ చెల్లించకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

డీజేలు వినియోగించొద్దు

ఎల్కతుర్తి, ఫిబ్రవరి 10 : శుభ, అశుభ కార్యాలయాల్లో డీజేలు వినియోగించొద్దని సీఐ పులి రమేశ్ సూచించారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లోని డీజే నిర్వాహకులతో సర్కిల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీజే వాడటం వల్ల శబ్ద కాలుశ్యం పెరుగుతుందని చెప్పారు. అధిక ధ్వని వల్ల ప్రజలు మరణిస్తున్నారని, ఇకపై ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ మోడల్ హౌస్ నాణ్యతతో నిర్మించాలి

- కలెక్టర్ ప్రావీణ్య
- నిరుపయోగంగా ఉన్న ఎస్సీ, బీసీ హాస్టల్స్, ఇరిగేషన్ క్వార్టర్ల పరిశీలన
- కేజీబీవీ విద్యార్థులతో కలిసి భోజనం
- పాఠశాలలో అన్ని వసతులు కల్పించాలని అధికారులకు ఆదేశం

కేజీబీవీలో విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

ధర్మసాగర్, ఫిబ్రవరి 10 : ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ ఇంటిని సోమవారం కలెక్టర్ ప్రావీణ్య పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నాణ్యతతో నిర్మాణం పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఇల్లు ఎంత విస్తీర్ణంలో నిర్మిస్తున్నారు? ఏం మెటీరియల్స్ వాడుతున్నారు? సిమెంట్, ఐరన్, ఇసుక, పనివారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం సిమెంట్ ఇటుకల సప్లయ్ కోసం స్వయం సహాయక మహిళా సంఘం గ్రూపుల వారితో మాట్లాడాలని సూచించారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం ఇచ్చే డబ్బులు సరిపోతాయా? అని అధికారులను అడిగారు. అనంతరం నిరుపయోగంగా ఉన్న ఎస్సీ, బీసీ హాస్టల్స్, నీటి పారుదల శాఖకు చెందిన దేవాదుల ప్రాజెక్టు క్వార్టర్లను పరిశీలించారు. ధర్మసాగర్ మండలానికి చెందిన సాంఘిక సంక్షేమ గురుకుల హాస్టల్‌ను ధర్మసాగర్‌కు తరలించాలని గ్రామస్తులు కోరారు.

కేజీబీవీ విద్యార్థులతో కలిసి భోజనం..

మండలంలోని ముప్పారం కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని కలెక్టర్ సందర్శించారు. విద్యాలయంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. మరుగుదొడ్ల పనులు, ఫ్యాన్స్, కరెంటు పనుల గురించి ఆరా తీశారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. వంట గదిని, భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. ఎంపీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం, హైమాస్ లైట్లు, పీఆర్ నిధులతో విద్యార్థుల సౌకర్యార్థం ప్లే గ్రౌండ్ ఏర్పాటు చేయాలని, అదనంగా ల్యాబ్‌కు కూడా నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు పీహెచ్‌సీ డాక్టర్ వైద్య పరీక్షలు చేస్తున్నారని తెలిపారు. డీఈ సిద్ధార్థ నాయక్, ఏఈ నరేందర్‌రాజు, ఎస్సీ కార్పొరేషన్ పీడీ బాలరాజు, రాజేందర్, డీఈవో వాసంతి, ఎంఈవో రాంధన్, జీసీడీవో సునీత, తహసీల్దార్ సదానందం, ఎంపీడీవో అనిల్ కుమార్, ఎస్‌వో మాధవి ఉన్నారు.

ఉప్పల్ మండలం ఏర్పాటు చేయాలి

ఉప్పల్‌లో మహాత్మాగాంధీకి వినతిపత్రం ఇస్తున్న అఖిలపక్షం నాయకులు

గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి నిరసన

కమలాపూర్, ఫిబ్రవరి 10 : ఉప్పల్ మేజర్ గ్రామపంచాయతీని మండలంగా ప్రకటించాలని మహాత్మాగాంధీకి వినతిపత్రం ఇచ్చి అఖిలపక్ష నాయకులు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 1985లో మండలాలు ఏర్పాటు చేసినప్పుడు ఉప్పల్‌నూ మండలం చేయాలని అధికారులు సూచించినా అప్పుడున్న పాలకులు కమలాపూర్‌ను మండలం చేశారన్నారు. అప్పటి నుంచి ప్రజల ఆకాంక్షను గుర్తించడం లేదన్నారు. మహాత్మా దేశానికి స్వాతంత్ర్యం తెచ్చావు.. మీరే ఉప్పల్ మండలం ప్రకటించేలా పాలకుల బుద్ధి మార్చాలని వినతిపత్రం ఇస్తూ కోరారు. అలాగే ఉప్పల్‌ను మండలంగా ప్రకటించాలని అఖిలపక్షం నాయకులు కాంగ్రెస్ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌కు వినతిపత్రం ఇచ్చారు. మేజర్ పంచాయతీ పరిధిలో ఉన్న 9గ్రామాలను కలుపుకుని మండలం చేయాలని కోరారు. అఖిలపక్షం నాయకులు నవీన్‌కుమార్, తోట సురేశ్, రాణా ప్రతాప్, దేవేందర్‌రావు, నాగరాజు, మహేశ్, సంపత్ రావు, చోటేమియా, రాజమౌళి, రాజు పాల్గొన్నారు.

మంత్రులకు వినతి..

ఉప్పల్ మేజర్ గ్రామపంచాయతీని మండలంగా ప్రకటించాలని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు నాయకులు వినతిపత్రం అందజేశారు. మండలానికి కావాల్సిన అర్హతలు ఉప్పల్‌కు ఉన్నాయని, 7 వేల మంది ఓటర్లు, 10వేలకు పైగా జనాభా ఉన్నదని చెప్పినట్లు తెలిపారు. కార్యక్రమంలో మారపల్లి మహేశ్, మొండెద్దుల నాగరాజు, పూసాల గణేశ్, తాళ్లపెల్లి శ్రీధర్ పాల్గొన్నారు.

బేడబుడగ జంగాలకు చైర్మన్ పదవి ఇవ్వాలి

మాట్లాడుతున్న బేడబుడగ జంగం జనసంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేణు

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 10 : కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో మాదిగ ఉపకులాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ అమలు చేయాలని బేడబుడగ జంగం జన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిరిపాటి వేణు అన్నారు. వెంటనే ఉపకులాల కార్పొరేషన్ ఏర్పాటు చేసి విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి, ఆర్థికంగా, రాజకీయంగా, అన్ని రంగాల్లో వెనుకబడిన ఏ-కేటగిరిలోని 13 కులాల్లో మేజర్ కులాలైన బేడబుడగ జంగాలకు చైర్మన్ పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బేడబుడగ జంగాలకు హైదరాబాద్‌లో వెయ్యి గజాల స్థలం కేటాయించి కమిటీ హాల్ నిర్మించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం, డబుల్ బెడ్ రూం ఇళ్లల్లో 20 శాతం కేటాయించాలన్నారు. సంఘం గౌరవాధ్యక్షుడు తూర్పాటి లింగయ్య, రాష్ట్ర ప్రచార కార్యదర్శి అనరాసి గిర్ని వెంకటి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుసంపత్‌కుమార్, చంద్రమౌళి, జంపయ్య, సిరి వాటి సారంగపాణి, శ్రీనివాస్, మోటం మస్తాన్, చిల్ల మధు, పస్తం సమ్మయ్య, శంకర్ పాల్గొన్నారు.

దవాఖానలో చికిత్స పొందుతున్న కార్పొరేటర్ సంకు నర్సింగరావును పరామర్శిస్తున్న దాస్యం వినయ్‌భాస్కర్

పార్టీ కార్యకర్తలను కాపాడుకుంటాం

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్

కాజీపేట, ఫిబ్రవరి 10 : బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు కష్టసుఖాల్లో అండగా ఉంటూ, కంటికి రెప్పలా కాపాడుకుంటామని పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. కాజీపేట పట్టణంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి నగరంలోని గార్డియన్ దవాఖానలో చికిత్స పొందుతున్న 47వ డివిజన్ కార్పొరేటర్ సంకు నర్సింగరావును ఆయన సోమవారం బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి పరామర్శించారు. నర్సింగ్‌రావును పార్టీపరంగా ఆదుకునేందుకు కృషి చేస్తానన్నారు. మాజీ కార్పొరేటర్ జోరిక రమేశ్, బీఆర్ఎస్ నాయకులు పులి రజనీకాంత్, కనుకరాజు, పోలెపల్లి రామ్మూర్తి, రాబర్ట్ పాల్గొన్నారు.

భద్రకాళీ చెరువు అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

మంత్రిని కోరిన ఎమ్మెల్యే నాయిని

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 10 : భద్రకాళీ చెరువు పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు. వచ్చే వర్షాకాలం నాటికి చెరువు పూడిక తీత పనులు పూర్తి చేయాలని, బండ్‌ను త్వరగా అందుబాటులోకి తీసుకురావాలన్నారు. జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన సమీక్షలో ఎమ్మెల్యే నాయిని మాట్లాడారు. జూమ్ మీటింగ్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, నీటి పారుదల శాఖ చీఫ్ ఇంజినీర్ మురళీధర్, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద పాల్గొన్నారు.

వైద్య సేవలపై దృష్టి పెడతాం : డీఎంహెచ్‌వో

'నమస్తే' కథనానికి స్పందన

శాయంపేట, ఫిబ్రవరి 10 : శాయంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలపై దృష్టి పెడతామని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి అల్లం అప్పయ్య అన్నారు. శాయంపేట ఆరోగ్య కేంద్రంలో కలెక్టర్ ఆదేశించిన ప్రసవాలు మొదలు కాలేదు. వైద్యులు, సిబ్బంది సాయంత్రం 4గంటల వరకే వెళ్లిపోతున్నారు. ఒక డాక్టర్, హెల్త్ అసిస్టెంట్ డిప్యుటేషన్‌పై వేరేచోట పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో 'ప్రసవాలపై పట్టింపేది' అనే శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో సోమవారం ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన డీఎంహెచ్‌వో అప్పయ్య మాట్లాడారు. అన్ని సర్దుబాటు చేస్తామని, కొంత సమయం పడుతుందన్నారు. జిల్లాలోని అన్ని దవాఖానల్లో కనీసం ఒక డాక్టర్ ఉండేలా సర్దుబాటు చేస్తున్నామని, డిప్యుటేషన్ అనివార్యంగా మారిందన్నారు. దీంతో శాయంపేట నుంచి ఒక డాక్టర్‌ను పట్టణ ఆరోగ్య కేంద్రానికి సర్దుబాటు చేసినట్లు పేర్కొన్నారు. పట్టణంలో ఉన్న ప్రతి ఆరోగ్య కేంద్ర పరిధిలో 50వేల జనాభా ఉంటుందని, ఇప్పటికి 7 పట్టణ అరోగ్య కేంద్రాలను ఒక్క డాక్టర్ లేకుండానే నడిపిస్తున్నట్లు చెప్పారు. దాదాపు అరవైకిపైగా ఉన్న డిప్యుటేషన్లను సగానికి తగ్గించామన్నారు.శాయంపేటలో వైద్య సేవలపై చర్యలు తీసుకుంటామని త్వరలోనే సర్దుబాటు చేస్తామన్నారు.

లక్ష్యాన్ని చేరేందుకు ఆత్మవిశ్వాసం అవసరం

మడికొండ, ఫిబ్రవరి 10 : విద్యార్థులు తమ లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఆత్మవిశ్వాశం, కష్టపడే స్వభావాన్ని పెంచుకోవడం ఎంతో అవసరం అని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు, మోటివేషన్ స్పీకర్ దామోదర్ అన్నారు. మడికొండలోని సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకులం కళాశాలలో విద్యార్థినులకు సంస్కార వికాస శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేదిశగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉమా మహేశ్వరి, వెంకటేశ్వర్లు, తేరాల యుగంధర్ పాల్గొన్నారు.

భూములు కాపాడాలని సీపీకి ఫిర్యాదు

కమలాపూర్, ఫిబ్రవరి 10 : తమ భూములను కబ్జా చేసి ఇబ్బందులకు గురి చేస్తున్న వ్యక్తులపై వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝూకు ఫిర్యాదు చేసినట్లు అఖిల భారత పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్నాల నరేందర్ సోమవారం తెలిపారు. కమలాపూర్‌లో పద్మశాలీలకు కేటాయించిన ప్లాట్లను ఎస్సీ కులానికి చెందిన కొందరు వ్యక్తులు కబ్జాచేసి అరిగోస పెడుతూ డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్లాట్లు కబ్జా చేసిన వ్యక్తుల నుంచి విముక్తి కల్పించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బచ్చు ఆనందం, యువజన విభాగం అధ్యక్షుడు పోరండ్ల కృష్ణప్రసాద్, నాయకులు వావిలాల మురళి, వెంగళ బాలకృష్ణ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

డాక్యుమెంట్ పోయినది

నేను, కేమిడి జయమ్మ, W/o యాకయ్య, R/o గ్రా॥ లక్ష్మీనారాయణపురం, మం॥ పాలకుర్తి, జి॥ జనగామ. మా యొక్క విస్నూరు గ్రామ వ్యవసాయ భూమి ఎ. 2-37 గుంటలు, సర్వే నెం. 605, 610, 612, ఒరిజినల్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ నెం. 1243/2014 గలది జనవరి 17న జనగామకు బ్యాంక్‌లోన్ పని నిమిత్తం పోయి వస్తుండగా పోయినది. దొరికినవారు దయచేసి సంప్ర: సెల్: 9347485283, 9182809036

BUILDING FOR SALE

★H.No: 2-6-75, Circuit House, Nakalgutta Hanamkonda, Ground floor Bldg, 160.7 Sq.yds, 1000 sqft RCC buildup area, East Facing, 1.15 Cr. Clear tittle, Brokers pls excuse. **Contact: 9949912347, 999896 12347, 63025 53816.**

NTW-332462

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

నియామకపత్రం అందుకుంటున్న శ్రీశైలం

వరల్డ్ కన్స్యూమర్ రైట్స్ రాష్ట్ర వర్కింగ్ చైర్మన్‌గా శ్రీశైలం

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 10 : వరల్డ్ కన్స్యూమర్ రైట్స్ రాష్ట్ర వర్కింగ్ చైర్మన్‌గా పర్లపల్లి శ్రీశైలం నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ మధ్యకాలంలో వినియోగదారులను అనేక విధాలుగా వ్యాపారులు దోపిడీ చేస్తున్నారని, ప్రజల హక్కులను కాపాడేందుకు కృషి చేస్తానన్నారు. రెస్టారెంట్స్, హోటల్స్‌లో ఆహారాన్ని విషతుల్యం కాకుండా చర్యలు తీసుకుంటానని, ప్రైవేట్ స్కూళ్లు, కళాశాలల్లో ఫీజుల పేరిట సామాన్య ప్రజల దగ్గర నుంచి దోపిడీ చేస్తున్నారని, అరికట్టేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. అలాగే తన నియామకానికి సహకరించిన డాక్టర్ శ్రీకాంత్‌కు శ్రీశైలం కృతజ్ఞతలు తెలిపారు.

28 వరకు మోకాళ్ల వైద్య శిబిరం

న్యూశాయంపేట, ఫిబ్రవరి 10 : హనుమకొండ హంటర్ రోడ్డులోని మెడికవర్ హాస్పిటల్లో నగరవాసులకు ఈ నెల 28వ తేదీ వరకు ఉచిత మోకాళ్ల వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆర్థోపెడిక్ వైద్యుడు రత్న కార్తీక్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అత్యాధునిక సదుపాయాలతో తక్కువ రక్త నష్టం, కచ్చితమైన నిర్ధారణ, ఒక్క రోజులోనే నడవగలిగే విదేశీ ఇంప్లాంట్స్‌తో ఉత్తమమైన ఫలితాలు సాధించొచ్చన్నారు. మోకాలి నొప్పికి సకాలంలో చికిత్స చేయకపోతే మొత్తం శరీర కదలికలపై ప్రభావం చూపుతుందన్నారు.

వ్యవసాయరంగపై అవగాహన పెంచుకోవాలి

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 10 : వ్యవసాయ రంగంపై యువత అవగాహన పెంపొందించుకోవాలని ఆర్ట్స్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ పుల్లా రమేశ్ అన్నారు. కాలేజీలోని ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో వ్యవసాయరంగ విభాగం ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించేందుకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ రంగంలో శిక్షణ పొందే విద్యార్థులకు స్టైఫండ్ కూడా ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ రహమాన్, శ్రీధర్‌కుమార్ లోథ్, వీరస్వామి, వ్యవసాయ శాఖ అధికారి భవ్య పాల్గొన్నారు.

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు యువిజ్ఞ

కాజీపేట, ఫిబ్రవరి 10 : ఫాతిమానగర్‌లోని మాంట్‌ఫోర్ట్ స్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థిని ఎడ్ల యువిజ్ఞ జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ గోపు విన్సెంట్ రెడ్డి తెలిపారు. పాఠశాలలో సోమవారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు మహారాష్ట్రంలోని ఔరంగాబాద్‌లో ఈ పోటీలు జరుగనున్నాయి. కాగా, యువిజ్ఞను ప్రిన్సిపాల్‌తో పాటు తెలంగాణ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ సాంబశివరావు, జిల్లా అసోసియేషన్ సెక్రటరీ తాబేటి రాజేందర్, కోశాధికారి వెంకటేశ్వర్లు అభినందించారు.

యువిజ్ఞను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ విన్సెంట్‌రెడ్డి

సమస్యలు పరిష్కారం కావడం లేదు

- బల్దియా గ్రీవెన్స్‌లో బాధితుల ఆవేదన

వరంగల్, ఫిబ్రవరి 10 : బల్దియా గ్రీవెన్స్‌లో సమస్యలు పరిష్కారం కావడం లేదని బాధితులు కమిషనర్ ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే సమస్యపై అనేకసార్లు ఫిర్యాదు చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయని వివరించారు. దీంతో గ్రీవెన్స్‌పై ప్రజల్లో నమ్మకం పోతున్నదన్నారు. సోమవారం కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో కమిషనర్ అశ్విని తానాజీ వాకడే నగరవాసుల నుంచి అర్జీలు స్వీకరించారు. 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్‌లోని 60 ఫీట్ల రోడ్డును కొంతమంది ఆక్రమించుకునేందుకు కుట్రలు చేస్తున్నారని కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రాజమోహన్‌రావు ఫిర్యాదు చేశారు. మచిలీ బజార్‌లోని ఓ ఇల్లు శిథిలావస్థలో ఉన్నదని, వెంటనే కార్పొరేషన్ అధికారులు దాన్ని కూల్చివేయాలని స్థానికులు వినతిపత్రం అందజేశారు. 56వ డివిజన్ మారుతీ కాలనీ రోడ్ నంబర్-2లో డ్రైనేజీ నిర్మించాలని కాలనీవాసులు వినతిపత్రం ఇచ్చారు. 14వ డివిజన్ సాయినగర్ కాలనీలో చాలా రోజులుగా నల్లాలు రావడం లేదని, పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని, తాగునీటి సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు కమిషనర్‌ను కోరారు. 12వ డివిజన్ తుమ్మల కుంటలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు నీరు రోడ్డుపై నిలుస్తున్నదని, వెంటనే డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని తుమ్మల కుంట వాసులు విన్నవించారు. 43వ డివిజన్ గవిచర్ల క్రాస్ రోడ్డులో సుప్రియ కిరాణా షాపు యజమాని శివరామ్ తన గృహాన్ని ఓయో లాడ్జికు కిరాయికి ఇచ్చాడని, నివాస ప్రాంతంలో లాడ్జి నిర్వహించడంపై వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం కమిషనర్ అధికారులతో మాట్లాడుతూ.. గ్రీవెన్స్ వినతులను వెంటవెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గ్రీవెన్స్‌లో మొత్తం 75 వినతులు వచ్చాయి. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 32, ఇంజినీరింగ్ విభాగం 16, ప్రజారోగ్య విభాగం 8, పన్నుల విభాగం 11, తాగునీటి సరఫరా 7, హార్టికల్చర్ ఒక వినతి వచ్చింది. గ్రీవెన్స్‌లో అదనపు కమిషనర్ జోనా, ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో రాజారెడ్డి, హెచ్‌వో రమేశ్, లక్ష్మారెడ్డి, బయాలాజిస్ట్ మాధవరెడ్డి, ఇన్‌చార్జి సిటీప్లానర్ రవీంద్రరాడేకర్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, రాజేశ్వర్, పన్నుల అధికారి రామకృష్ణ పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌లో బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

కొత్త విద్యుత్ సర్వీసుల మంజూరు సులభతరం

హనుమకొండ, ఫిబ్రవరి 10 : వినియోగదారులకు కొత్త విద్యుత్ సర్వీసుల మంజూరు మరింత సులభతరం చేసినట్లు ఎన్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్ ఎస్ఈ వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కారణాలతో కొత్త సర్వీసుల మంజూరు ఆలస్యం కాకుండా ఉండేందుకు దరఖాస్తుదారుడికి ప్రతి దశలో మెసేజ్ వెళ్తుందని తెలిపారు. ఎస్ఎంఎస్ ద్వారా పూర్తి వివరాలు తెలుసుకొని నిర్దిష్ట సమయంలో అవసరమైన పత్రాలు సమర్పించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అలాగే వినియోగదారుడు తన అప్లికేషన్ స్థితిని తెలుసుకోవడానికి కొత్తగా ట్రాకింగ్ సిస్టం ఏర్పాటు చేశామని, అప్లికేషన్ నంబర్‌తో టీజీ ఎన్పీడీసీఎల్ వెబ్‌సైట్ లో లేదా టీజీ ఎన్పీడీసీఎల్ మొబైల్ యాప్ స్టేటస్ తెలుసుకోవచ్చన్నారు. మరింత సమాచారం కోసం 1912 నంబర్‌కు ఫోన్ చేయాలని ఎస్ఈ ఆ ప్రకటనలో కోరారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఐఏఎస్ రవి, నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి, కలెక్టర్ సత్యశారద

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 10 : పర్యావరణ పరిరక్షణ బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి అన్నారు. నిట్‌లో మిషన్ లైఫ్ ఆధ్వర్యంలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి స్పాన్సర్‌తో 'పర్యావరణ స్థిరత్వం' అనే అంశంపై వర్క్‌షాప్ ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి రవి హాజరయ్యారు. వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద, ఎన్ఐటీ డైరెక్టర్ బిద్యధర్ సుబుధి, వర్క్‌షాప్ కన్వీనర్లు ఆనంద్ కిశోర్, వెంకటేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. వర్క్‌షాప్ కన్వీనర్ ఆనంద్ కిశోర్ తన ప్రారంభ సందేశంలో వర్క్‌షాప్ లక్ష్యాలు, నేపథ్యం వివరించారు. నిట్ డైరెక్టర్ ఎన్ఐటీలో చేపట్టిన పచ్చదన కార్యక్రమాల వివరాలు తెలిపారు. కలెక్టర్ పర్యావరణ అనుకూల జీవనశైలిని ప్రోత్సహించడంలో ప్రభుత్వ చర్యలపై వివరించారు. ఎన్ఐటీ పూర్వవిద్యార్థి, ఐఏఎస్ రవి తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి తీసుకుంటున్న చర్యల ప్రణాళికలు తెలిపారు.